# నవ్వని పువ్వు

"అతివ ఆలోచన, యోచనా సుందరి, నీరజాక్షి నిరీక్షణ-యీ పేర్లలో యీ ప్రతిమకి ఏ పేరు సరిపోతుందబ్బా !" ఎదురుగా నిలబడి యిల్లా హాస్యం ఆడుతున్న సరస్వతిని పట్టించుకోలేదు మల్లిక. అలాగే కూర్చునివుంది.

"చెప్పు మల్లీ - నీ ఆలోచ నేమిటి ? అంత మూడ్‌లో పడిపోతే ఎలా ? శ్రీనాధులు మనస్సులో నిలబడి నవ్వుతున్నారా ?" అంటూ మల్లిక ప్రక్కనే కూర్చుంది సరస్వతి. కొంచెంగా ఎరుపెక్కాయి మల్లిక చెక్కిళ్ళు యీ మాటకి. రెప్పలు వాల్చి చిన్నగా నవ్వింది. కానీ వెంటనే బేలగా సరస్వతి చేతిని తనచేతిలో తీసుకుంది.

"నిన్నొక సలహా అడుగుతానుగానీ మనస్ఫూర్తిగా చెబుతావా ?" అన్నది.

"ఇంకా నేనిచ్చే సలహాలు వినిపించుకునే స్థితిలో వుందా యీ మల్లిక ?" అన్నది సరస్వతి.

"నువ్వు కాకపోతే నాకింకెవరిస్తారు సలహా ?—మరి, నేను డాన్సు మానెయ్యాలట—కబురు చేశారు." అన్నది మల్లిక తలవంచి

"ఎవరు ?"– అని వెంటనే గ్రహించి "కాబోయే శ్రీవారేనా కబురు పంపింది? ఎవరితో, హంసతోనా ?"

"వేళాకోళంగాదు సరూ! వాళ్ళ అమ్మకి, నాన్నగారికి అభ్యంతరం లేదుట కానీ-" అంటూ ఆగిపోయింది. "చెప్పు. వప్పుకో మంటావా ఈ షరతుకి?" అన్నది మల్లిక.

"వప్పుకోకపోతే - వదులుకోగలవా ఆయన్ని? మనసిచ్చేశా వేమోగా?"

"నీకన్నీ హాస్యమే, నిజంగా చెప్పు. డ్యాన్సు ఇంత అలవాటైంది కదా? హఠాత్తుగా మానేసి బ్రతగ్గలనంటావా?" జాలిగా వుంది మల్లిక ప్రశ్న.

"ఫరవాలేదు మల్లీ! ఇల్లాంటి షరతులు అందరూ పెడతారు. తప్పదు. ఇప్పుడు కాకపోయినా, మరో రెండేళ్ళకి యిద్దరు పాపాయిలు పుట్టాకనైనా మానేయవలసిందేగా?"

నవ్వు, సిగ్గు, చిరుకోపం కలిసిన భావం ఒకటి అందంగా వెలిసింది యీ మాటకి మల్లిక ముఖాన!

"ఎంత బాగున్నావు! అలా కళ్ళు వాలుస్తోంటే. ఇలాగే మరులుగొలిపి, ఆయన్ని వప్పించుకుందువు గానిలే."

మల్లిక ఐదో ఏట 'వెన్న పెట్టెద రారా' అన్న చిన్న పదానికి అడుగులు వేసింది మొదలు, బి. ఏ. చదువుతున్న యీ 19వ సంవత్సరంవరకు కనీసం వందైనా ప్రదర్శన లిచ్చింది. స్కూల్లో, కాలేజీలో, వివిధ కళాశాలల పోటీలలో, ఢిల్లీ యువజనోత్సవాలలో పాల్గొన్నది. బహుమతులు, ప్రశంసా పత్రాలు అనేకం. ఒకసారి యూనివర్శిటీలో జరిగిన ప్రోగ్రాం సందర్భంలోనే శ్రీనాథుని పరిచయం చేశారు కాలేజీ ప్రిన్సిపాలు. అతను యూనివర్శిటీలో రీడరు.

"చాలాబాగా చేశారండీ. ఢిల్లీ ఏమిటి-బెర్లిన్ వెళ్ళినా మన యూనివర్శిటీకి మంచి ప్రైజు తెచ్చుకొస్తారు" అన్నాడు చిరునవ్వుతో.

ఆ నవ్వు ఆ రాత్రి మళ్లీ గుర్తుకొచ్చింది మల్లికకి. అన్ని చప్పట్లు, అభినందనలలోంచి అదొక్కటే కొలనులో తెల్లకలువలా లేచి మనస్సుని పులకరింపచేసింది. ఎంతసేపో కాదు. ఒక్క క్షణం!

కానీ - ఆ తర్వాత ఎన్నాళ్ళకో - ఒక ఏడాదికి నాన్నగారు చూసి, నిశ్చయించడానికి సిద్ధపడుతున్న సంబంధం అదే. తను పెళ్ళి చేసుకుని గృహిణిగా స్థిరపడాలన్న కోరిక ఎప్పుడూ అంతకు మునుపు మనస్సుని వూపలేదు. కాబోయే అత్తగారు, మామగారు వచ్చి తనని చూసి వెళ్లినప్పుడూ, ఆ తర్వాత అతనొకసారి హఠాత్తుగా కనబడినప్పుడు క్రొత్త సిగ్గు, ముసురుకొంటున్న ఆశలు క్రమ్ముకొన్నాయి మల్లికని. అంతకీ కారణము - ఆయనే. ఏ పని చేస్తున్నా, ఏ పనీ చేయకుండా కూర్చున్నా, నిద్రపోతున్నా, అద్దంముందు కూర్చుని అందం చూచుకొంటున్నా వెనుక వుండి పలుకరిస్తున్నారన్నట్లు ఉలికిపడేది మల్లిక మనస్సు.

తాంబూలాలు పుచ్చుకునేముందు, తీరా ఈ కబురు, అత్త మామలది కాదుట, అభ్యంతరం ఆయనదేట! "దాని అభిప్రాయం కనుక్కోవాలి" అన్నారుట నాన్నగారు.

ఆయనే అన్నారా అలాంటి మాట - కృంగిపోయింది మల్లిక. అవో పెద్ద పరతు చేశారా పెళ్ళికి? నమ్మడం కష్టం. ఎవర్నడుగుతుంది ఎందుకిలా అంటున్నారని? తనతోనే చెప్పకూడదూ యీ మాట?

"ఎలాగే అమ్మా?" అన్నది మల్లిక ఉండబట్టలేక.

"నువ్వు కలకాలం స్టేజి ఎక్కి నాట్యం చేస్తావా ఏమన్నానా? అన్నీ ఇష్టమైనప్పుడు ఇదొక్కటే అడ్డువస్తుందా?" అన్నది అమ్మ. తనింకా సందేహిస్తోంటే, "అందరూ పెదతారమ్మా యిలాంటి షరతులు. ఆ తర్వాత మీ యిద్దరి యిష్టమూ కలిస్తే అన్ని అభ్యంత రాలు అప్పుడే పోతాయి" అని నచ్చచెప్పింది అమ్మ.

"నువ్వు కాదు కూడదంటే బలవంతం చేయవద్దని నాన్నగారు గట్టిగా చెప్పారు" అన్నది కూడా ఆమె.

ఎవరో ఏదో అంటారనీ, అమ్మా, నాన్న బాధపడతారనీ కాదు. సంకోచం కలిగినా, భయం రేకెత్తినా, మనస్సు కృంగినా ఏమి జరిగినా మనసులో తిష్టవేసిన ఆయన మూర్తి అంగుళం కదలలేదు.

మద్రాసు, మైసూరు, బెంగుళూరు, తిరుపతి, హార్సిలీ కొండలు ఇరవై రోజులు రైళ్ళల్లో, బస్సుల్లో, టాక్సీల్లో, హోటళ్లలో, గెస్టు హౌసుల్లో, అరుణ ప్రభాతాలు, నీలినీడల సంధ్యలు, వెండి వెన్నెల రాత్రులు కలిసిచూశారు - మల్లిక, శ్రీనాథ్. రైలు వూపుకి లయగా శరీరం వూగుతోంటే కళ్లు మూసుకుని అతని భుజంమీద తలవాల్చేది ఆమె. భోజనం చేస్తోంటే, చేయి తాకితే, కందిన బుగ్గలతో కళ్లు వాల్చేది. గెస్టు హౌసుల్లో అమ్మగారు, అయ్యగారు అని గౌరవించి మాట్లాడుతుంటే నాకీ కొత్తహోదా ఏమిటని మురిసిపోయేది. తన చెవి దగ్గర అతను 'చీకట్లో చూడాలి నీకళ్ల తళతళలు' అని రహస్యంగా పాడుతుంటే 'ఉష్' అని అతన్ని వారించేది.

ఇంత సంబరంలో ఒకనాడు-గదిలో దీపం మెరుస్తూ వెలుగు తూండగా అతను మంచంమీద పడుకునివున్నాడు. ఆమె ప్రక్కనే కూర్చునుంది. ఆమె వ్రేళ్ళతో ఆడుకొంటున్నా డతను. "ఎంత

నునుపో, ఎంత తెలుపో నీ వ్రేళ్ళు! బాగా పోషణ చేస్తావల్లేవుందే రుచిగా వుంటాయా?" అన్నాడు చిటికిన వ్రేలు చటుక్కున కొరికి.

"అబ్బ!" అని చేయి లాక్కుంది. చటుక్కున "ఇదేమి హస్తమో తెలుసా, కర్తరీముఖం" అన్నది హస్తంపట్టి.

"అహ - అల్లాగా? నాకు నాట్యం నేర్పరాదూ పోనీ?" అన్నాడు.

"నేను చేస్తేగా—మీకు నేర్పేది?" గడుసుగా అడిగాననుకుంది ప్రశ్న.

"చాలా గడుసుగా అడిగావే? నాకు నేర్పడానికి చెయ్యొచ్చు."

"చెయ్యొచ్చునంటే మరెందుకని మానేయమని కబురు పెట్టారు?"

అతనింకా ఆమె వ్రేళ్ళని సవరిస్తూనే వున్నాడు. "ఏం, కోపం వచ్చిందా అలా అన్నానని?" అన్నాడు.

"వచ్చింది. కానీ మీ అంతట మీరే నాకు చెబుతారేమో కారణం అని ఎదురు చూస్తున్నాను. మీకు నిజంగా అంత అభ్యంతరమా?"

అతను వెంటనే ఏమీ అనలేదు. ఆమె చేతిని వదిలేసి, చేతులు రెండూ తలక్రింద పెట్టుకున్నాడు. "మల్లీ, నువ్వు నలుగురిలోను డ్యాన్సు చేస్తోంటే, అందరూ నీ అందం పరిశీలనగా చూస్తారు. అది నేను భరించలేను. ఈ మాత్రం దురాశ యీ ప్రియుడికుండదూ?" అన్నాడు. అతని కళ్లు ఆలోచనలతో బరువుగా వున్నాయి. మల్లిక

తలవంచుకునే కూర్చున్నది. అర్థమైపోయింది ఆయన అభ్యంతరం. నాట్యమంటే సౌందర్య ప్రదర్శనేనా అనిపించింది.

"చెప్పు. నిజంగా చాలా కష్టంగా వుంటుందా నా కోరిక మన్నించడం?" అన్నాడతను ఆమెవేపు తిరిగి భుజంమీద చేయివేసి.

మల్లిక తేలిగ్గా నవ్వింది. "ఉండదు" అన్నది.

—బి. ఏ. రిజల్ట్సు వచ్చాయి పెళ్ళి కాగానే. క్లాసు వచ్చింది. ఎమ్. ఏ. అన్నది, లైబ్రరీ, డిప్లొమా కోర్సు అన్నది, లా అన్నది-కానీ దేనికీ శ్రీనాథ్ వప్పుకున్నాడు కాదు. "రోజూ కాలేజీకి ఎక్కడ వెడతావు. నువ్వెడితే నాకు తోచదు" అన్నాడు. అత్తగారు, మామగారు పెద్దకొడుకుదగ్గర విశాఖపట్నంలో వుంటారు. ఇంట్లో ఒక్కతే తను. అతను యూనివర్శిటీకి వెళ్ళేటప్పుడు స్కూటరుమీద తీసుకెళ్ళి అమ్మగారింటిలో దింపేవాడు. మధ్యాహ్నం మూడింటికి తనే వచ్చేసేది యింటికి. హఠాత్తుగా అంత చైతన్యం ఆపేయటం కష్టంగా ఉండేది. ఎంతసేపని పుస్తకాలు చదువుతుంది. రేడియో వింటుంది. కుట్లు కుడుతుంది? తగిన పరిశ్రమలేక వళ్ళుకూడ రావటం ప్రారంభించింది. "ప్రొద్దున్న ఎక్సర్సైజు చేసుకోరాదూ?" అంటాడతను.

"నేను యింట్లోనే వుంటానివాళ" అన్నది ఒకనాడు అతను బయలుదేరమని తొందరచేస్తుంటే. కారణం అతనడగలేదు. తను చెప్పలేదు. రాత్రి వనజ ఫోన్ చేసింది ఏదో మాట్లాడాలి వస్తానని. ఇల్లంతా బాగా సర్దుకుంది మల్లిక—వనజ యింటిని చూసి ఇల్లాలిని చూసేరకం మనిషి కనక.

"ఏమిటి యింత లావైనావు—ప్రొఫెసరు అంత బాగా చూసుకుంటున్నారా నిన్ను?" అన్నది వనజ వస్తూనే బుజాలుపట్టి కుదిపేస్తూ.

దిగులుగా ముఖం పెట్టి "నిజంగా అంత ఘోరంగా వున్నానా?" అన్నది మల్లిక.

"ఛా - వూరికే అన్నాను. బాగున్నావు నిండుగా. అంత దిగులు పడతావేం? ఇంకా వళ్ళు వచ్చేయకుండా సన్నబడటానికి ఉపాయం చెప్పడానికే వచ్చాను నేను" తనొచ్చినపని చెప్పింది వనజ. కాలేజీలో ఓల్డు స్టూడెంట్సు డేట- ఆ రోజున తను డాన్సు చేయాలిట.

"వద్దు వనజా - అదిమాత్రం నన్నడగకు" అన్నది మల్లిక వెంటనే.

"అదేమిటి? నీది షూర్ ప్రోగ్రాం అని నేను అనుకుంటే" అని ఒక్క నిముషం పరకాయించి చూసి "చేసే స్థితిలో లేవా" అన్నది.

"అబ్బే! అదేమీలేదు—ఆయన కిష్టంలేదు" అని తలవంచుకుని చెప్పింది. వనజ తేలిగ్గా వదిలే మనిషికాదు.

"నువ్వేమీ పెద్ద ప్రదర్శన మివ్వడం లేదుగా? అదైతే ఆయనకి అభ్యంతరం ఉండొచ్చు. మనం నలుగురం స్నేహితులం కలిసే అకేషన్ యిది. ఒక్క పది నిముషాల ఓేప్ ఏదైనావుంటే చేసెయ్యి" అన్నదామె. కొంచెం ఆగి "పెళ్ళికిముందు ఎన్నో అంటారు అవన్నీ పట్టుకు్కూచుంటే కాపురం సాగుతుందా?" అన్నది.

మల్లిక కాస్సేపు ఆలోచించింది. ఏమీ అనక తమాయించుకుని "రా లోపలికి, నా సంసారం చూడవూ!" అని లేచింది. అనాసపండు ముక్కలుపెట్టి ఓవల్టిన్ కలిపి యిచ్చింది. ఇంట్లో తను కొనుక్కున్న వస్తువులు, బహుమానాలు వచ్చిన వస్తువులు అన్నీ చూపించింది.

"మరింతకీ ఏమిటో చెప్పు నీ అభిప్రాయం - నామట్టుకు నాకు ఏమీ తప్పు కనబడటంలేదు. నేర్చుకున్న విద్య సరదాకైనా పనికి రావద్దూ?" అన్నది చివరికి వనజ! "పోనీ నేను మాట్లాడనా ఆయనతో?" అన్నది.

"అమ్మో వద్దు! నేను ఆలోచించుకుంటాను. రేపు ఫోన్‌చేసి చెబుతాను" అన్నది.

"నేనే చేస్తాను. బాధ్యత నాదేగా?" అని నవ్వింది వనజ.

ఆమె వెళ్ళిపోయాక ఏమీ తోచక యిల్లంతా తిరిగింది మల్లిక. బీరువా తెరిచి బట్టలు సర్దుతూ, డాన్సు డ్రస్సులు తీసి చూసింది. అప్పట్లో యివి అమ్మగారింటినుంచి తీసుకురావద్దనుకుంది తను. "నీవేగా? పట్టుకెళ్ళు" అన్నది అమ్మ. అక్కడ నేర్చినవి అక్కడే వదిలేయాల్సింది అన్న ఆలోచన వచ్చి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి మల్లికకు.

నాట్యం అంటే శరీర సౌందర్యాన్ని ప్రదర్శించడమనే అపోహలో పడిపోయారు అంత తెలిసినాయనా. సరే. ఆయన మాటనేబట్టి ఆలోచించినా, ఆ సౌందర్య ప్రదర్శన, తోటి ఆడవాళ్ళ ముందైతే అభ్యంతరం ఎందుకుంటుంది? కానీ ఆయనతో వాదించడం కష్టం. ఇక దీన్ని గురించి చర్చలేదు అన్నట్లు ఏదో ఒకటి అనేస్తారు. తనకింక ఏమనడానికీ తోచదు.

పదిరోజులుంది ఓల్డు స్టూడెంట్సుడే. తను కొంచెం ప్రాక్టీసు చేస్తే యిరవై నిముషాలకి రెండు అయిటమ్స్ చేయగలదు. ఆ రోజు బుధవారం కూడాను. ఆయనకి రోటరీడే. ఇంట్లో వుండరు. ఇల్లా ఆలోచిస్తోంటే మల్లిక గుండెలు గబగబ కొట్టుకున్నాయి. చెప్పకుండా

వెళ్ళిపోయి చేస్తే? ఆలోచన తోచగానే చాలా గాభరా కలిగింది. అది మెల్లగా సర్దుకుని, ఆయనకి తెలిసే అవకాశం లేదని, ఒకవేళ తెలిసినా ఏం కోప్పడతారులే అని ఆలోచించుకుంది. తనేమంత తప్పు చేస్తోంది ఆయన బాధపడటానికి, తోటి ఆడపిల్లల కోరికని మన్నిస్తున్నాను. అంతేగా అనుకుంది. చివరికి ఈ నిర్ణయానికి వచ్చాక మనస్సు కలత దీరింది. డ్రస్సులు ఒక అరగంటసేపు గాలికి ఆరబెట్టి, లోపల దాచింది.

“రోజంతా ఏంచేశావు—తోచదని గోలచేస్తావుగా - ఒక్క తైపీ వుంటే తోచిందా?” అన్నాడు మధ్యాహ్నం మూడున్నరకు తిరిగి రాగానే శ్రీనాథ్.

“ఓ” అని తలూపింది మల్లిక. అతనికి ఫలహారం, టీ అవీ యిస్తోంటే “ఏమిటింత ఉషారుగా వున్నావు?” అన్నాడు. నవ్వేసింది మల్లిక. ఉల్లాసంగా వున్న యీ సమయంలో అనుమతి అడుగుదామా అనిపించి మళ్ళీ వద్దంటారేమోనన్న బెరుకు వెనక్కి లాగగా, వూరుకుంది.

రోజూ ప్రొద్దున్నే తను ప్రాక్టీసు చేస్తోంటే, అతను వచ్చి తొంగిచూసి వెళ్ళిపోయేవాడు. ఎందుకు చేస్తున్నావని అడుగుతాడేమో. అబద్ధం ఎలా చెప్పనా అనుకునేది. అతను అడగలేదు. ఎల్లుండి ప్రోగ్రాం అనగా అమ్మతో అన్నది, ఇల్లా చేస్తున్నాను, రాత్రికివచ్చి ఉండిపోతానని. ‘అతను వప్పుకున్నాడా?’ అనడిగింది అమ్మ. తను చెప్పలేదంటే ‘అలా ఎందుకు చేస్తావు’ అని మందలించింది. మల్లిక వాదనలోకి దిగితే, ఆవిడకి చికాకు వచ్చి ‘మీ సంసారం షంగతి నాకెందుకు?’ అని వూరుకుంది.

—మంగళవారం ప్రొద్దున్న వనజ ఇన్విటేషన్ తెచ్చి ఆయన కిచ్చినప్పుడు మల్లిక ఎదురుగా చూసింది ఆయనవంక. ఎవరి పేర్లూ లేవు. వినోద కార్యక్రమం అని మాత్రమే వుంది. "ఓహో, యీ ఓల్డు గరల్స్ ఆటలు, పాటలుకూడా చూపిస్తారన్నమాట" అని నవ్వాడతను.

"రోటరీ బొంబాయి గవర్నరు వస్తున్నారు. సాయంత్రంనుంచి చాలా పనుంటుంది. ఏమీ అనుకోకండి రాలేనందుకు, మల్లిక ఎలాగూ వస్తుందిగా?" అన్నాడు.

వనజ వెడుతుంటే గేటువరకు వెళ్ళింది మల్లిక, "ఎందుకు యిచ్చావు ఇన్విటేషను—నన్నేదో రభసచేసేట్లే ఉన్నావు. ఊరంతా పిలుస్తున్నావా?" అన్నది కొంచెం కోపంగా.

"లేదు. ఊరికేనే కొందరి మనుష్యుల్ని పిలుస్తున్నాము. ఇంతకీ మీ ఆయన వస్తారేమో కొంపదీసి?" అన్నది వనజ.

"రారులే. ఒకవేళ వస్తారని చూచాయగా తెలిసినా నేను గైరుహాజరు. నీ పరువేమైనా కానీ. ఇంకెప్పుడూ ఇలాంటి పని చేయను బాబూ!" అన్నది మల్లిక.

బుధవారం రాత్రి అమ్మగారింట్లో వుంటానని పర్మిషన్ పుచ్చుకుంది. అతను సరేనన్నాడు.

మేకప్ చేసుకుని అద్దంలో చూసుకుంటే 'ఎన్నాళ్ళకు!' అని మనస్సు సంబరపడింది.

చాలమంది జనం వచ్చారు. సరస్వతి కూడా వచ్చింది. అయిటమ్ కాగానే లోపలికి వచ్చి కౌగలించుకున్నంతపని చేసింది. "మొత్తమ్మీద గెలిచావే?" అన్నది నవ్వుతూ. మల్లిక నవ్వలేకపోయింది. ప్రతివాళ్ళ

తోనూ అబద్ధం ఆడాలంటే కష్టంగా వుంది. సరిగ్గా సమాధానం చెప్ప కుండా ఏదో వేరే మాట్లాడింది.

రాత్రి వనజ కారులో యింటిదగ్గర దిగబెట్టింది. అమ్మ, నాన్న గారు తనకోసం భోంచేయకుండా కూర్చుని వున్నారు. "బాగా జరి గిందా?" అనడిగింది అమ్మ.

మల్లిక తలూపి, "మీరు కూర్చోండినాన్నా. నేనొక పావు గంటలో వస్తాను" అంటూ మేకప్ కడుక్కోవడానికి వెళ్ళింది. తను వచ్చేసరికి వాళ్ళు మాట్లాడుతున్నది ఆపేశారు. అమ్మ తననిచూసి కంచంలో వడ్డించింది. భోజనం చేస్తోంటే నాన్నగారు చాలా మౌనంగా వున్నారు. తను చేసినపని ఆయనకి అయిష్టత కలిగించిందని గ్రహిం చింది మల్లిక. కానీ, ఆయన ఏమైనా ప్రస్తావిస్తేనే ఆ విషయం మాట్లాడుదామనుకుంది.

ప్రొద్దున్నే కాఫీత్రాగి యింటికి వెళ్ళిపోయింది. డ్రస్సులు, షేపు అవీ వదిలేసి వెళ్ళింది. భయం భయంగా వుంది అతనికి తెలిసి పోతుందేమోనని. ఇల్లు, ఆయనా మామూలుగానే వుండడంచూసి మనస్సు కుదుటపడింది.

"నువ్వు లేకపోతే నా కేమీ తోచలేదు మల్లీ - ఉంటే పని సాగదని అనే వాడినా, లేకపోతే ఏదీ సాగదని తెలిసింది" అన్నాడు శ్రీనాథ్. వెళ్ళిన వెంటనే వంటపనిలో పడిపోయింది. మరో ఆలో చనకు వ్యవధిలేదు. కాలేజీకి వెళ్ళాక ఎవరైనా చెబుతారేమోనని భయం వేసింది.

నాట్యం చేస్తోంటే ఏమిటో హాయిగా వుంటుంది. మనస్సు, శరీరం తేలిగ్గా వుంటాయి. ఎంతోమంది అనుభవాలు పాటలలో పొదిగితే, వాటికి గురువులు అభినయం కూర్చారు. నర్తకి వాటిని అనుభవిస్తూ, తాదాత్మ్యం పొందుతూ ప్రదర్శిస్తుంది. అందులో అభ్యంతరకరమైన విషయం ఏమున్నది? ఆయన్ని అడిగి తేల్చుకోవాలి. ఆలోచిస్తూవుంటే ప్రయోజనం ఏమిలేదుకానీ, ఆలోచన మానడం తనతరం కావడంలేదు. సాయంత్రం ఆయన వచ్చీరాగానే ముఖం వంక పరిశీలనగా చూచింది. కోపం కనబడలేదు. 'అమ్మయ్యా గట్టెక్కినట్లే' అనుకుంది.

మర్నాడు ప్రొద్దున్న కాఫీచేసి ఆయన కిద్దామని పట్టుకొచ్చింది. హాల్లో పేపరు చూచుకుంటున్నారు. కాఫీ యిస్తే అందుకుని, మళ్లీ పేపరు చూస్తున్నారు. తన కాఫీగ్లాసు తెచ్చుకుని, ఆయన కుర్చీవెనకాల కెళ్లి నిలబడి పేపరులోకి చూసింది. చటుక్కున చూసింది కుడిచేతివేపు పైనున్న ఫొటో. ఒక్కసారిగా చెమట పట్టింది. గ్లాసు చేతులోంచి క్రింద పడుతుందేమో అనిపించింది మెల్లిగా కదిలి లోపలికి బయలుదేరింది. గాభరాగా వుంది. ఏదో ఒ. పని చేయాలన్నట్లు తచ్చాడింది. డైనింగు టేబిలు దగ్గర కూర్చుని కాబేజి సన్నగా తరగడ మారంభించింది. ఆయన వస్తారు, అడుగుతారు అని గాభరావేస్తోంది. ఆ ఫొటో ఎవరు తీశారు. పత్రికకి ఎవరిచ్చారు - అదేమంత పెద్ద ఉత్సవమని తీసుకున్నారో ఆ ఫొటో - ఇంకేపీ దొరకక వేసినట్లున్నారు.

నాలుగైదు నిముషాలకి మనస్సు కొంచెం సర్దుకుంది. ఎలాగైనా యీ పరిస్థితికి తను సిద్ధపడే వుంది. ఇంకెందుకు గాభరా-

అనుకుంటుంటే శ్రీనాథ్ లోపలికి వచ్చాడు. ఖాళీగ్లాసు తెచ్చి లోపల పెట్టాడు. అది ఎన్నడూ చేయనిపని. తనతో ఏమి అనకుండానే స్నానానికి వెళ్ళిపోవడం చూచింది. చాలా కోపం వచ్చినట్లు అర్థమైంది. స్నానం చేసివచ్చి బట్టలు వేసుకుంటున్నాడు గదిలో. ఎక్కడికి వెడుతున్నట్లు – తల దువ్వుకుని, చెప్పులు తొడుక్కుంటుంటే వెనుక వెళ్ళి నిలబడింది. "ఎక్కడికి వెడుతున్నారు – ఇంత ప్రొద్దున్నే ?" అన్నది – ఎంతో నీరసంగా వచ్చింది మాట. సమాధానం చెప్పలేదు. ఆమెని తప్పించుకుని బయటికి వెళ్ళిపోయాడు. దెబ్బతిన్నట్లు వెనక్కి తగ్గింది మల్లిక.

అతను వెళ్ళిన పది నిముషాలకి తేరుకుని, హాల్లోకివెళ్ళి పేపరు తీసి చూచింది. తన ఫొటో 'తిల్లాన'లో పోజు, ఆ క్రింద వార్షికోత్సవం గూర్చి పదిలైన్ల రిపోర్టు ఉన్నాయి. ఫొటోలు ఆ రోజు ఆడపిల్లలే తీశారు సరదాకి. ఎవరు పంపారో పత్రికకి ? వనజకి ఫోన్ చేద్దామా అనుకుంది. తన సంసారం విషయాలన్నీ ఎందుకు చెప్పుకోవడమని మళ్ళీ ఆలోచించింది. ఆయన చూడ్డం చూసేశారు. ఇక ఎవర్నడిగి ఏం లాభం ?

స్నానం, వంట పూర్తయినాయి. పదకొండు, ఆ తర్వాత పన్నెండు గంటలు దాటుతున్నాయి. కానీ ఆయన జాడలేదు – మల్లికకి ఆకలి వేస్తోంది. ఎక్కడికి వెళ్ళినట్లు ? పన్నెండున్నర అవుతోంటే యూనివర్శిటీకి ఫోన్ చేసింది. ఐదారు నిముషాలకి శ్రీనాథ్ కంఠం "హల్లో !" అని వినబడింది.

"నేనే మాట్లాడుతున్నాను"

"ఆ–ఏమిటి ?" అన్నాడతను.

"మీరు భోజనానికి రాలేదు. నేను వెయిట్ చేస్తున్నాను"

"తినేసేయి."

"నేను తినను. మీరు రండి"

"నేను రావడానికి వీల్లేదు"

"ఎన్నింటికి వస్తారు ?"

కథా నిలయం 2292 శ్రీకాకుళం

"తెలియదు. పనుంది. అయామ్ వెరీ బిజీ హియర్" అంటూ పెట్టివేశాడు. మల్లికకి ఉక్రోషం, ఏడుపు వచ్చాయి. ఆకలి మండి పోతోంది. లోపలికి వెళ్ళికాస్త మజ్జిగ త్రాగింది పంచదార వేసుకుని. మంచంమీద పడుకుంది.

ఎప్పుడు నిద్ర పట్టిందో, మెలకువ వచ్చేసరికి నాలుగున్నరైంది. తలుపులు తీసే నిద్రపోయానని గుర్తు వచ్చేసరికి చటుక్కున లేచింది. హాల్లో టేబిలుదగ్గర కూర్చుని ఆయన వ్రాసుకుంటున్నారు. వెళ్లి వెనకాల నిలబడి భుజంమీద చేయివేసింది. తనచేత్తో తొలగించాడతను. "చాలా కోపం వచ్చిందే నామీద ?" అన్నది. వ్రాస్తున్న అతని కలం ఆగింది.

"మధ్యాహ్నం ఎక్కడైనా భోజనం చేశారా ? వండినవన్నీ అలాగే వున్నాయి" అన్నది. అతను బదులు పలుకలేదు.

"టీ చేయమంటారా? లేకపోతే, పెరుగు అన్నం తింటారా"

"నాకేమీ వద్దు. నీపని నువ్వు చూసుకో."

"నా పని మిమ్మల్ని చూసుకోవడమే. చెప్పండి" అన్నది అతని జుట్టు సవరిస్తూ.

అతను కలం, పుస్తకం మూసేశాడు. వ్రాసుకుంటున్న కాగితం మడిచాడు. "నేను పసిపిల్లవాడినని నీ ఉద్దేశ్యమా మల్లికా ?" అన్నాడు వెనక్కి తిరిగి.

ఆమె తల వంచేసింది. "అలా ఎందు కనుకుంటాను ?" అన్నది

"మరి ?– నీ యిష్టప్రకారం నువ్వుండు. నన్నిలా బ్రతకనియ్యి."

"నేనేం చేశానండీ యిప్పుడు ? ఆడపిల్లల కాలేజీకదా అని చేశాను. మీకు చెప్పకపోవడం తప్పే."

"నేను ఆ విషయం అడగటంలేదు. నా అభిప్రాయానికి గడ్డిపోచ విలువ లేనప్పుడు నాతో మాట్లాడవలసిన అవసరం లేదు." అన్నాడు.

"మీ మాట కాకపోతే ఇంకెవరిమాట కావాలి నాకు ? ఒక్క సారి ఆడపిల్లల కాలేజీలో చేసినందుకు యింత కోపం రావాలా ?"

"నా మనస్సులో కోపతాపాలు కలగడానికికూడా నీకు అభ్యంతరం ఉందా ? నీలాగ రహస్యాలు దాచుకోవడం నాకు చేతకాదు."

"నేనిప్పుడేం చేశాను రహస్యంగా? మిమ్మల్నడిగితే మీరు వద్దంటారేమోనని భయంవేసి వూరుకున్నాను అంత దాచుకోవలసిన తప్పు నేనేం చేశాను ?" ఉక్రోషంతో వచ్చాయి యీ ప్రశ్నలు.

"తప్పు చేయలేదనే నువ్వనుకొంటున్నావా ?" కళ్లు చిట్లిస్తూ అతనడిగిన ఈ ప్రశ్నకి ఆమె మనస్సు భగ్గుమంది.

"ఏం తప్పు చేశాను – అసభ్యమా, అవినీతా చిన్న డాన్సు చేస్తే ? ఇంత చదువుకుని, సంస్కారంగల మనిషి యింత సంకుచితంగా ఆలో

చిస్తారని అనుకోలేదు. పదిహేనేళ్ళనుంచి నేను, నా నాట్యం పెన వేసుకుని పోయినాము. జబ్బుచేసి పడుకుంటేతప్ప, ఒక్కనాడు మానలేదు నేను. ఎంత కట్టుబాటు చేసుకున్నాను నా కోరికని— ఎప్పుడో నచ్చచెప్పుకోగలను అనుకున్నాను. నేర్చుకున్న విద్య లోపల్లోపలే నాశనం చేయాలని మీకేమిటి యీ పట్టుదల?" కంఠం జీరబోయింది. ఏమీ చేయలేని తన స్థితికి దుఃఖం వచ్చింది. ఏడుస్తూ లోపలికి వెళ్ళిపోయింది.

ఏడుపు ఆపుకుంటూ, కళ్ళు తుడుచుకుంటూ టీ చేయడం ప్రారంభించింది. ఎటువంటి మనిషిని, ఎలా ఐపోయినానని తోచి మనస్సు బాధతో బరువెక్కి పోయింది. టీ తయారుచేసి, పట్టుకెళ్ళింది. అతను అందుకోలేదు.

"నాకువద్దు. నువ్వుత్రాగు" అన్నాడు.

"నేను త్రాగడంకోసం చేసుకున్నానా యిది? ఏమిటింత పంతం మీకు!" అన్నది.

"నీయిష్టం నీదైనప్పుడు నాయిష్టం నాది."

"సరే అయితే, నేనిక్కడ ఉండి కూడ మీకేమీ ప్రయోజనం లేదు. ఉన్నా, లేకపోయినా మీకు బాధలేదు. ఇంకా వుంటేనే బాధ. మా ఇంటికి వెళ్ళిపోతాను."

ఇందుకు అతనేమీ అనకపోయేసరికి, "ఏమంటారు?" అని రెట్టించింది.

"నీ యిష్టం" అన్నాడు.

టీ గ్లాసు అక్కడే వదిలేసి, విసవిస లోపలికి వెళ్ళిపోయింది. ఈ వేళతో తేలిపోయింది. బట్టలు ఒక బ్యాగ్‌లో పెట్టుకుంది. ముఖం కడుక్కుని, తల దువ్వుకుంది. వెనుక తలుపులన్నీ వేసేసి, వండిన అన్నం అల్లాగే టేబిలుమీద వదిలేసి యివతలికి వచ్చింది. "నేను వెడుతున్నాను" అన్నది. అతను బదులు పలుకలేదు. ఒక్క నిముషం నిలబడి, బయటకు నడిచింది.

—బట్టలు చూసి, అమ్మ "యిదేమిటి" అన్నది. "వచ్చేశాను" అన్నది మల్లిక. అమ్మ తెల్లబోయింది. "అదేమిటి? పోట్లాడుకున్నారా?" అన్నది.

"ఏదో ఒకటి–నన్నేమీ అడక్కమ్మా!" మేడమీది గదిలోకివెళ్ళి, బ్యాగ్ పడేసి పడుకుంది.

అమ్మ పైకి వచ్చింది. "ఏమిటి మళ్లీ అల్లా పడుకున్నావు? ఏమైందో చెప్పవేం? నువ్వు తనతో చెప్పకుండా డాన్సు చేశావని తెలిసిందా? కోప్పడ్డాడా?" అని ఎన్నిసార్లో అడగ్గా అడగ్గా చివరికి మల్లిక పలికింది. "నేనంటే అంత గిట్టకపోతే అక్కడ ఉండనమ్మా." అని.

"మీరు చదువుకున్నవాళ్ళు, ఏ మైనా కలతలొస్తే సర్దుకోవాలి గానీ రభస చేసుకుంటారుటే?" అన్నది అమ్మ.

"సర్దుకోవటం యిద్దరిలోనూ ఉండాలిగా? నన్నే అంటారు. ఆయనకి చెప్పరేం?"

"స్వంత బిడ్డవి నీకు చెప్పలేకపోతే యింక అతనికేమి చెప్పగలము?" అన్నది అమ్మ.

నాన్నగారు వూళ్లోలేరు. అమ్మ ఎన్నోసార్లు బలవంతం చేయగా వెళ్లి భోజనం చేసింది మల్లి. పూర్తిగా విషయం అర్థం చేసికోకుండా మాట్లాడుతుంది అమ్మ అన్నిటికీ తనదే బాధ్యత అన్నట్లు "ఒక్కత్తెవీ పడుకుంటావా పైన?" అని అమ్మ అడిగితే తలూపి పైకి వెళ్ళిపోయింది మల్లిక.

పడుకుంటే ఎప్పటికీ నిద్రపట్టదు. రేపట్నించీ తను సీరియస్‌గా డ్యాన్సు ప్రాక్టీసు చెయ్యవలసిందే. రెండు మూడు నెలల్లో మూడు గంటల ప్రదర్శనలు ఇవ్వగలదు. స్టూడెంటుగా వున్నప్పుడు తనకి పేరు వుండనేవుంది. ఇప్పుడు కొత్తగా పరిచయం చేసుకోనక్కర్లేదు. నెలకి రెండైనా ప్రదర్శన లివ్వవచ్చు. బొంబాయిలో, పూనాలో. అలహాబాదులో స్నేహితులున్నారు. అటువేపు చాలా అవకాశా లుంటాయి.

ఇలా ఆలోచిస్తుంటే నిజంగా ఎంతో భవిష్యత్తు కనబడుతోంది. మాస్టరుగారు అనేవారు—'నాట్యంమాత్రం వదలకు, అందరినీ వరించదు ఆ కళ. వరించినప్పుడు త్రోసేయకూడదు' అని. పెళ్ళికి ఆయన రాలేదు. ఆ తర్వాత యింటికి పిలిచి బట్టలు పెట్టారు. 'మీ ఆయన కిష్టమేనా' అని ఆయనడిగితే, 'వూఁ' అన్నది మెల్లిగా.

పది, పదకొండు, పన్నెండు – క్రింద గడియారం గంటలు కొట్టినప్పుడు హఠాత్తుగా 'ఆయనేం చేస్తున్నారో' అనిపించేది. వెంటనే నలకని తీసినట్లు ఆ ఆలోచనని తీసేసేది. తనను గురించి అంత ఆలోచనే ఆయనకి వుంటే ఇంత వరకూ వచ్చేదికాదు పరిస్థితి.

తను నర్తకిగా గొప్పపేరు తెచ్చుకుంటోంటే, ఆయన ఒక్క సారైనా ఒక్క ప్రదర్శనైనా చూడ్డానికిరారూ? చూసినప్పుడైనా

అనిపించదూ ఎందు కింత అన్యాయం చేశానని? తను పేరుకోసం చేస్తోందనే అనుకుంటారు కానీ - తనలో జ్వాలగా వెలుగుతున్న ఒక ఆకాంక్షతో, తనని మైమరపించే ఒక ప్రేరణతో చేస్తోంది. తన బ్రతుకులో ఒక భాగం యీ నాట్యం — అనుకోరు. తనే గోపికగా, రాధగా కృష్ణుడిగా, మహిషాసుర మర్దనిగా అన్నిటిగా మారిపోయి అనుభూతి పొందుతుంది. శరీరంలో, మనస్సులో ఒక ఠీవి, ఒక నిండు దనం ఆక్రమించుకుంటాయి. ప్రాచీనమైన యీ దేశ సంస్కృతీ చిహ్నంగా తాను నర్తిస్తున్నట్లు, లాస్యపార్వతి అంశ తనలో ఒక కళికగా వెలిగి కాంతులు చిమ్ముతున్నట్లు భావాలు కలిగేవి. అవన్నీ ఆయనకి అర్థంకావు. ఎప్పటికీ బోధపడవు.

పడుకుంటే తోచడంలేదు. లైటువేసి, కిటికీ దగ్గర నిలబడింది. క్రింద మామిడి చెట్టుమీద లైటు పడుతోంది. ప్రక్కనే వున్న సన్నజాజి గుబురుమీద తెల్లగా పూలు కనిపిస్తున్నాయి. చినుకులుపడి చెట్లన్నీ తడిసి, గాలికి వూగుతున్నాయి. ఎక్కడా ఏమీ చప్పుడు లేదు. నిశ్శబ్దత భయం వేసేదిగా వుంటుంది ఒక్కోసారి. అలజడి కలిగించేదిగా వుంటుంది మరోసారి.

ఆయనే ప్రేక్షకుల్లో వున్నప్పుడు నాతోడి దాంపత్యంకంటే యీ ఆట ఎక్కువదా మల్లికి — అనుకుంటారు. అనుకుంటారు! పదునుగా ఏదో కదిలింది మనస్సులో. ఎక్కువదా? ఎవరో త్రోసినట్లు ముందుకు వంగి కిటికీచువ్వలకి ముఖం ఆన్చి క్రిందికి చూసింది. విర బూసిన సన్నజాజి ఎంత సున్నితంగా వుంది. అలాంటిదికాదూ తన సంసారం - తన నూరేళ్ళ బ్రతుకు!

అలా చూస్తుంటే ఏ ఆలోచనా రాలేదు. ఇందాకటి వూహ లన్నీ చెరిగిపోయి వెలితిగా వుంది మనస్సు. ఆయన అలాగే అనుంటారు.

అనుకోవడంకాదు, అదే నిజమని తాను చెప్పేసి మరీ వచ్చింది. 'మీకంటే నాకిదే ఎక్కువ' అని చెప్పింది—నోటితో కాదు, ఎన్నో విధాల చెప్పింది. గాలి విపరీతంగా వీచి సన్నజాజి కదిలిపోతోంది. ఒక్క క్షణం, తెల్లగా మెరుస్తున్న పూలన్నీ రాలిపోయి, పచ్చని ఆకులన్నీ వాడిపోయి మోడులాంటి సన్నజాజి కళ్ళముందు కనబడింది. అదేమిటని కంగారు పడింది మల్లిక మనస్సు. నీ సంసారం అన్నట్లు ఎక్కడో లోప ల్లోపల్నుంచి సన్నగా వినబడినట్లయింది.

పన్నెండు, ఒంటిగంట, రెండు — గంటలు విన్నది. కళ్లు మంటలు పుడుతున్నాయి. ఆవిర్లు వస్తున్నాయి శరీరంలో. 'అమ్మా!' అని నిట్టూర్చింది. మనస్సు కరిగిపోయినట్లు కన్నీళ్లు క్రమ్ముకున్నాయి. నిప్పులా లైటు వెలుగుతూనేవుంది. ఎఱ్ఱని జ్యోతుల్లాంటి ఆ కళ్ళు ఎప్పుడో నిద్రతో మూసుకున్నాయి.

— అతని చెయ్యి తగిలి, చల్లారిపోయిన టీ గ్లాసు ప్రక్కకు ఒరిగింది. టేబిలంతా వున్న కాగితాలు హడావిడిగా తీసేసి, టీ బొట్లుగా క్రిందకు కారుతోంటే బ్లాటింగు పేపరు వేశాడు. ఇంకా క్రిందికి కారుతోంటే లోపలికి వెళ్లి బట్టకోసం వెతికి, అది కనబడక రుమాలు తెచ్చి తుడిచాడు. ఇల్లంతా జిడ్డుగా వుంది. ఏమీ పనిచేయ డానికి కుదురదు. ఫాన్ వేసి వెళ్లి బయట నిలబడ్డాడు.

తను అనుకున్నంతా అయింది. ఎంత కోపం ఈ మనిషికి! భగవంతుడు యిద్దరికీ శిక్ష వేయబట్టి యీ దాంపత్యం యిలా పరిణ మించింది.

లోపలికి వెళ్ళి కాస్సేపు తిరిగాడు. బట్టలు మార్చుకుని యింటికి తాళంవేసి బయలుదేరాడు. పిల్లలు ఆడుకుంటున్నారు వీధిలో. నడిచి, నడిచి విసుగొచ్చింది.

ఆకలి వేస్తోంది. హోటల్లోకి వెళ్లాడు. భోంచేద్దామనిపించింది. మల్లి తిన్నదో లేదో అని తోచి, కడుపులో దేవినట్లయింది కాఫీ తెప్పించుకొని మెల్లిగా త్రాగాడు. ఇంటికి వెళ్ళాలనిపించడం లేదు. తను వస్తాడని ఎదురుచూసేవా రెవరున్నారు కనుక ?

మల్లిక వెళ్ళగానే వాళ్ళు అడిగి వుంటారు ఎందుకొచ్చావని. ఆమె ఏదో చెప్పివుంటుంది. తను ప్రొద్దున్నుంచీ ఎంత బాధపడ్డాడు. మనిషిపై విశ్వాసం ఎలా వుంటుంది ? తనని మోసంచేసి కూడా చేద్దామనుకుంది. ఎప్పటికైనా తెలిసివస్తుంది ఆమెకి. పెద్దలైనా తెలియ చెబుతారు. ఏదీ జరక్కపోతే ? పెద్ద నిటూర్పు విడిచాడు శ్రీనాథ్.

ఎంతసేపూ కళ అంటుందేకానీ, ఆ కళనిచూసే ప్రేక్షకుల సంగతి ఆలోచించిందా ? అందరూ కళకోసమే చూస్తారా ? అభినయం అర్థమయ్యే చప్పట్లు కొడతారా? ఆమె శరీరం వయ్యారాన్నీ, చేపల్లా కదిలే కళ్ళనీ చూస్తారు. తనకి ప్రాణం పోయినట్లుంటుంది అది తలచుకుంటే. ఆమెకది అర్థంకాదే !

మెల్లిగా నడుస్తూ పార్కువేపు చేరాడు. తను కాఫీ త్రాగుతున్నప్పుడు కాబోలు, వర్షం కురిసింది. పార్కు అంతా దీపాలు. గడ్డి కాలిక్రింద మెత్తగా వుంది. గాలికి చెట్లు కదిలి, నీటితుంపర్లు

మీద రాలుతున్నాయి సిమెంటు తిన్నె ఒకటి కడిగినట్లుగా తెల్లగా వుంది. దాని మీద కూర్చున్నాడు.

ఎందుకిల్లా మూర్ఖంగా ప్రవర్తిస్తుంది మల్లిక? పదిహేనేళ్ళ నుంచి అలవాటైంది డ్యాన్సు అంటుంది - ఔనుమరి, తను ఏడాది నుంచేగా అలవాటైనాడు! ఎలా కొలుస్తోంది అనుబంధాలని ఏళ్ళతో!

పైన వెలిగే లైటువంక చూస్తూ, ఆ బెంచీమీద వ్రాలాడు శ్రీనాథ్. అమ్మకీ, నాన్నకీ తెలుస్తుందేమో యిలా జరిగిందని! బంగారు బొమ్మలా వుంది కోడలని మురిసిపోయింది అమ్మ. తను మాత్రం? అప్పుడు యూనివర్సిటీలో చూచినప్పుడు, పాలరాతితో చెక్కిన శిల్పం నడిచివస్తోంది అనిపించింది తనకి. ఆ రూపాన్ని చూసే సమ్మోహితుడై, ప్రేమించాడు.

ఔను, ఆ రోజు స్టేజిమీద శ్వేతపద్మం నూరు రేకులు విప్పుకుని, ఆడుతున్నట్లు కనబడింది తన కళ్ళకి. నిజంగా నాట్యం చేసేటప్పుడు ఆమెని చూడడానికి కళ్ళు చాలవు. తెల్లత్రాచులా పరుగెత్తుతుంది. మెరుపుతీగెలా తళుక్కున మెరుస్తుంది. జాలిగా నదిలా ప్రవహించి నట్లుంటుంది. ఆమె వ్యక్తిత్వం పూర్తిగా విచ్చుకుని పదహారు కళలతో శోభిస్తుంది. అప్పుడే కాదూ తనకళ్ళు మిరుమిట్లు గొలిపింది! మళ్ళీ ఆ స్థితికి వెడతానంటుంది! ఔను, అలా అయిపోవాలని పిచ్చిగా ప్రయత్నిస్తోంది కదూ?

రేకులన్నీ విప్పుకున్న పద్మం నవ్వుతుంది. తను ప్రేమించింది ఆ పద్మాన్నేగా? ముడుచుకుపోయిన రేకులతో మొగ్గలావున్న పద్మం

నవ్వదేం? రేకులు మణిగిపోయి వడిలిపోతున్న పద్మం నవ్వదేం? నవ్వదు. వడిలిన ఆ పద్మం బదులు మల్లిక కనబడింది అతని కళ్ళ ముందు. శ్రీనాథ్ లేచి కూర్చున్నాడు. అలజడిగా నుంచున్నాడు. చినుకులు ప్రారంభమౌతోంటే చకచక నడిచి బయటికి వచ్చాడు.

— స్నానంచేసి, కాఫీ త్రాగి, బ్యాగ్ పుచ్చుకుని బయలుదేరిన మల్లికను చూసి అమ్మ 'ఎక్కడికి?' అని అడగలేదు.

— గేటులోపలికి వస్తున్న స్కూటరుని చూచి, వరండా మెట్ల దగ్గరే ఆగిపోయి, ఏదో పనున్నట్లు మరో వేపుకి చూడ సాగింది మల్లిక.

———